స్వాతి సపరివారపత్రిక కథల పోటీలోబహుమతి పొందిన కథ (13-2-87)

# రసరమ్య గీతం

"ఒక్కసారి కాలాన్ని వెనక్కి తిప్పగలిగితే ఎంత బావుంటుంది?"

"ఏం? ఎందుకని?" అని కుతూహలంగా అడిగాడతను.

"కాలేజీలో చదువుకునే రోజులు, గోదావరి గట్టున గడిపిన ఆ తియ్యని సాయంత్రాలు.... అవన్నీ గుర్తుకు రావటం లేదూ?" ఆమె గుండెల నిండా ఆవేదన...

అతని నవ్వులో బలవంతం. "నేను మరిచిందెప్పుడు!"

"ఆ రోజు నాకిప్పటికీ గుర్తు. మీ యింటికి వచ్చి మాధవుడెక్కడున్నాడంటే మల్లె పందిర కింద కూర్చుని మధుర కవితలల్లుతున్నాడమ్మా అని మీ వదిన పరిహాసం చేస్తే నేను పరవశంతో పొంగిపోతూ పందిర క్రిందకి దూరి వచ్చాను. ఎవరు నువ్వని కొంటెగా అడిగావు. నేను నీ కవితా కన్యని అన్నాను. నీ ముఖం ఎంత ఎర్రబడిందని!

ఇప్పుడు నువ్వెంత అందంగా వున్నావో తెలుసా అని నేన్ననందుకు నువ్వు రాసిన కవిత నాకిప్పటికీ గుర్తుంది.

ఈ అందం నాది కాదు - అది నీ కన్నుల దీప్తిది!
ఈ మధురిమ నాది కాదు - అది నీలో వూరే అమృతానిది.
ఈ పరిమళం నాది కాదు - అది నీ నవ్వుల పుప్పొడిది.
ఈ సంతృప్తి నాది కాదు - అది నీవిచ్చే స్నేహానిది!

అని కదూ వ్రాసావు?"

"అదీ ఒక కవితేనా! ఇప్పుడు చదువుకుంటే సిగ్గేస్తుంది!"

"ఇంకా బాగా రాయాలనిపించేవాడికి ఎంత రాసినా రుచించదు. ఆవేళ మనం మల్లెపందిర క్రింద కలుసుకున్న క్షణాన్ని వర్ణించి చెప్పు. ఇప్పుడు వింటాను."

"బలేదానికే ఇప్పుడు కవితలెక్కడ రాస్తున్నాను! కథా రచనలోకి దిగాక కవితలు వెన్నక్కి వెళ్ళాయి" అని నవ్వాడతను.

"ఇది వరకెన్నో చదివావు. ఒక్కటీ గుర్తు రావటం లేదా?" అంది ఆశ్చర్యపోతూ.

"ఉంది. నీతో గడిపిన ప్రతి మధుర క్షణానికీ నాకో పద్యం గుర్తుంది!"

"మరి చెప్పు!" అంది ఆమె ఉప్పెనలా పొంగుతూ.

"ఆ మనోహర మధుర సాయంతనమున
క్షిపవన నికుంజ వేదికపై నుంటి నేను;
ఒరిగి ఒయ్యార మొలుక కూర్చుండినావు
అందముల రాణివై అస్మదభిముఖముగ"

ఆమె కళ్లలోకి నీళ్ళు చిప్పిల్లాయి.

అతని మనస్సు చివుక్కుమంది. "ఎందుకు రాధా!"

"మనమాటే పెద్దవాళ్ళు వినివుంటే.... నీ నోట కవితలు వింటూ నువ్వు తీసుకుపోయే వింత లోకాలలో విహరిస్తూ ఈ జీవితాన్ని మరొకవైపుకి తిప్పుకుపోయేదాన్ని! ఫ్చ్! అంత నా దౌర్భాగ్యం!....." అంది ఆమె గద్గద స్వరంతో.

అతను చకితుడయ్యాడు. "రాధా!.... ఆయన నిన్ను...."

".....బాగానే చూసుకుంటారు. అయినా ఆయన నువ్వు కాలేవుగా! స్నేహ మాధుర్యాన్ని పంచిపుచ్చుకున్న ఆ క్షణాలు మన జీవితంలో ఎంతో మరువలేనివి కాదూ?"

"అవును."

"ఆ అనుభూతుల్ని నింపుకొని జీవితం పంచుకోనివ్వకుండా చేసారు పెద్దవాళ్ళు. ఏం పెద్దవాళ్ళు వీళ్ళు? నేను నీకన్నా ఆర్నెల్లు పెద్దదాన్ననే కదా....! ఈ బంధాన్ని త్రెంచేసారు! అంతలోనే వరహీనమయిపోతుందా?.... మనిద్దర్నీ ఒకచోట చూసినవాళ్ళు మన కీడు జోడు సరిపోయిందని అనుకోలేదూ! లోకంలో అంతా బర్త్ సర్టిఫికెట్లు చూసుకునే ప్రేమించుకుంటున్నారా!"

అతనికేమనాలో పాలుపోలేదు.

"నీకు చదువు పూర్తికాకముందే నా చదువు మాన్పించి మావాళ్ళు నా పెళ్ళి చేసేసారు. ఈ దేశంలో ఆడదానికి ఓ వ్యక్తిత్వమూ, తనకంటూ చిన్న కోరికలు కొన్ని ఉంటాయని ఎవరికీ పట్టదనుకుంటా! పైకి చెప్పుకొనే స్వతంత్రమూ లేదు. కదూ?"

"ఏం చెప్పను రాధా! నేనేమన్నా నిన్నింకా బాధ పెట్టిన వాడినవుతాను!"

అతనికి దగ్గరగా వచ్చి అతని చేతిమీద చేయివేసి మృదువుగా నిమురుతూ "లేదు మధూ! నువ్వు కావాలన్నా నన్ను బాధపెట్టలేవు. నువ్వు మళ్ళీ నా కళ్ళబడినందుకు నాకెంత ఆనందంగా వుందో నీకు తెలియదు. మళ్ళీ నిన్నీ జీవితంలో చూగలుగుతాననుకోలేదు. చూడటమే కాదు ఇంత దగ్గరగా నిలబడి ప్రేమగా మాట్లాడుతున్నావు కూడ. ఇది కలయేమోనని నాకు భయంగా వుంది!" అంది ఆమె.

"ఎంత పిచ్చిదానివి!" అన్నాడతను ఆమె చేతి వ్రేళ్ళను రాగరంజితం చేస్తూ.

"అవును మధూ! అద్దెయిల్లు వెతుక్కుంటూ నువ్వే నా యింటికి వస్తావని కలలో కూడ వూహించలేదు. వాస్తవం కూడ ఇంత తియ్యగా వుంటుందని మొదటిసారి తెల్సింది!"

"ఎందుకీ కన్నీళ్ళు? ఇంత అందమయిన కళ్ళున్నది నవ్వి నవ్వించటానికి కాని కన్నీళ్ళు కురిపించటానికి కాదు....స్త్రీలతో స్నేహమంటే నాకు చాలా మక్కువ. వాళ్ళ అందం నాకిష్టం. వాళ్ళ కోమలత్వం నాకిష్టం. వాళ్ళ పరిహాసాలు నాకిష్టం.... అన్నాడు. శామ్యూల్ జాన్సన్! నాకూ నీ నవ్వులూ పరిహాసాలూ అంటే యిష్టం. ఈ కన్నీళ్ళు మాత్రం మహా కష్టం!"

"నీ మాటలే కవితల్లా వినిపిస్తాయి నాకు. సరే, ఈ నాల్గు క్షణాలూ నవ్వుతూ గడిపేస్తా!" ఆమె కన్నీళ్ళు తుడుచుకుని నవ్వింది.

"అలాగన్నావు బావుంది."

"కాని, నువ్వెందుకింకా పెళ్ళి చేసుకోలేదు?"

"నాకు పెళ్ళికావాలని మావాళ్ళని అడగనా!" అన్నాడు ఎర్రబడ్డ ముఖంతో.

"అదేమిటి, మీ వాళ్ళు ప్రయత్నం చేయటంలేదూ?"

"ఆనాడు నిన్ను నాకు దక్కకుండా పెద్దవాళ్ళు చేసిన రోజున రాధ నాది అని చెప్పగలిగే వయసూ, స్తోమత, ధైర్యం అప్పుడు లేకపోయాయి. కాని, ఈ వేళ.... అవన్నీ ఉన్నా ఇంకా లైను క్లియర్ కాలేదు."

"నువ్వనేది నాకర్థం కాలేదు."

"మా చిన్నన్నయ్య పి.హెచ్.డి. పూర్తి చేస్తే కాని పెళ్ళి చేసుకోడుట!" అని పల్చగా నవ్వాడతను.

అప్పుడే శేషశాయి లోపలికి రావటంతో వాళ్ళ సంభాషణ అక్కడితో ఆగిపోయింది.

"మా రాధ చదువు ఎలా సాగుతోందండీ!" అని అడిగాడు అతను.

అనూరాధ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"పరీక్షకి చదవటం వేరు. విజ్ఞానం కోసం చదవడం వేరు. ప్రతి మాటకీ అర్థం తెలిస్తే కాని ముందుకు వెళ్ళదు. అందుకే కొంచెం టైము పడుతుంది" అన్నాడు మాధవరావు.

"ఫర్వాలేదు. పట్టనివ్వండి తనకి ఇంటరెస్టు వుంది. మీకు చెప్పగలిగే కెపాసిటీ ఉంది. నాకొకటే ఆశ్చర్యంగా వుంటుందడీ – మీ బి.కామ్ డిగ్రీకి ఈ తెలుగు పొయిట్రీకి లంకె ఎలా కుదిరిందా అని!"

మాధవరావు నవ్వి వూరుకున్నాడు.

"అదొకవరం!" అంది అనూరాధ మంచి నీళ్ళగ్లాసుని భర్తకందిస్తూ.

"నిజమే! ఆయన మన యింటికి రావటం మన అదృష్టమూను" అన్నాడు శేషశాయి నవ్వుతూ.

మర్నాడు మాధవరావు అనూరాధని అడిగాడు. "మీవారు చాలా చక్కగా మాట్లాడతారు. ఆయన మాటలు వింటుంటే నిన్ను చాలా అభిమానంగా చూస్తున్నారనే నాకనిపిస్తోంది. మరి నువ్వంత నిర్లిప్తంగా నిరుత్సాహంగా వుంటావేం?"

"ఎలా ఉన్నాను? బాగానే వున్నానుగా"

ఆమె నవ్వులో కాంతి లేదు.

"కాదు. నీలో ఏదో వెలితి కనిపిస్తోంది. నాతో చెప్పవూ!"

"ఇలా ప్రశ్నలతో వేధించకపోతే చక్కని కవితలేవో వినిపించి నీరసమయిన క్షణాల్ని రసమయం చేయకూడదూ!"

"ఎప్పుడూ నా కవితలేనా? నీ పాట కూడా ఒకటి పాడి వినిపించు.

"ఏదీ ఆ దేవామృతవర్షిణి రాగంలో పాడిన త్యాగరాజకృతి ఒక్కసారి పాడి వినిపించు!" ఆమె మానసవీణని అతను శ్రుతి చేసాడు. వీణ ఎలామీటితే అలా పలుకుతుంది! ఆమె గొంతు శ్రుతి చేసుకుంది. ఆ రాగంలాగునే ఆమె అనురాగధారలు వర్షించాయి!

'ఎవరని నిర్ణయించేదిరా ని
న్నెట్లారాధించేదిరా? నరవర!
శివుడివో? మాధవుడవో?
కమలభవుఁడవో? పరబ్రహ్మమవో!......

ఆ పాట విన్నాక "పాడలేననుకున్నావు. చూడు! ఎంత చక్కగా పాడావో!" అన్నాడతను.

"నాకు నీ మాటలే కాదు. కవితలు కూడా కావాలి!" అంది మూతి మురిపెంగా తిప్పుతూ.

'అంజనరేఖ వాల్గనుల యంచుల దాట, మనోజ్ఞమల్లికా
కుంజములో సుధామధుర కోమల గీతిక లాలపించు ఓ
కంజదళాక్షి! నీ ప్రణయ గానములో పులకింతునా - మనో
రంజని! పుష్పవృష్టి పయిరాల్చి నినున్ బులకింపు జేతునా!"

గబుక్కున అతని చేతినందుకొని తన ముద్దుల ముద్రలు వేసింది అనూరాధ.

"అందుకనే భర్తృహరి అన్నాడు - అతి మధుర మెద్ది కాంతా ధరామృతంబు సరసజనులకుఁ జింతింపజాలునెద్ది? పువ్వు బోడుల వెలలేని జవ్వనంబు!.... అని!" అన్నాడతను చిరుహాసం చేస్తూ.

గబుక్కున పైకిలేచి అతని ముఖాన్ని తన చేతుల్లోకి తీసుకొని అతని పెదవుల మీద గాఢంగా ముద్దుపెట్టింది అనూరాధ.

ఒళ్ళు జల్లుమంది. గుండె గొంతుకలోకి వచ్చింది. వింత అనుభూతితో అతను గుక్క తిప్పుకొనేలోగా. సిగ్గు ముంచుకు వచ్చి కాబోలు - అనూరాధ అక్కడ్నించి పరిగెత్తుకొని వెళ్ళి పోయింది.

● ● ●

మూడు రోజుల క్యాంపు వుందని చెప్పి వూరికి వెళ్ళాడు శేషసాయి.

మాధవరావు తానా యింటికి వచ్చిన రోజుకీ.... ఇప్పటికీ అనూరాధలో చాలా తేడా కనిపించింది. మొదటిరోజున చూసిన నిస్తేజం నిర్వేదం ఆమెలో ఇప్పుడు మచ్చుకయినా లేవు. సెలయేరులా త్రుళ్ళింతలు పోతూ విరగబూసిన పారిజాతంలా వూగిసలాడుతూ నవ్విస్తూ, కవ్విస్తూ అతన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది ఇప్పుడు!

ఆవేళ రాత్రి మాధవరావు గదిలో అడుగుపెట్టింది అనూరాధ.

"నువ్వా! ఎవరో అప్సరస దివినుండి భువికి దిగివచ్చిందనుకున్నా."

"అబ్బ, అంత అందంగా వున్నానా నేను!"

"రాధ ఎంత అందంగా వుందో తనకెలా తెలుస్తుంది. మాధవుడైపుట్టి ఆ కళ్ళెట్టుకు చూస్తే తెలుస్తుంది!"

అతనికి దగ్గరగా వచ్చి అతని కళ్ళల్లోకి ఆరాధనగా చూస్తూ, "మధూ!" అని పిల్చింది.

"ఏమిటి రాధా!" అన్నాడతను లాలనగా.

"నిన్నొకటడగాలని వచ్చాను" అంది తలదించుకుంటూ.

"ఏమిటీ?" అన్నాడు. ఎందుకో అతని ఒళ్ళు గరిపొడిచింది.

గబుక్కున తన చేతిలోని కాగితం మడతని అతని చేతుల్లో పెట్టింది ఆమె. మడతలు విప్పిన కాగితం మీద అతని కళ్ళు వరవడి పెట్టాయి.

'రాధనురా ప్రభూ! నిరపరాధనురా! అనురాగ భావనా
రాధ నమగ్న మానసనురా! కనరా! కరుణింపరా! మనో
వీధి పదే పదే కలకవేయుచున్నవిరా! పురారహో
గాథలు - ఈదలేనిక అగాధ తమోమయ కాలవాహినిన్!"

"రాధా!" అన్నాడు పిచ్చిగా చూస్తూ.

ఆమె కళ్ళు అశ్రుపూరితాలయినాయి. ముక్కుపుటాలెగసాయి. చెక్కిళ్ళు ఎరుపెక్కాయి. ఉరోజాలు ఎగసెగసి పడుతున్నాయి. "అర్థం చేసుకుంటావనే..."

"తొందర పడుతున్నావేమో!"

"నాకు గతం పోయింది. భవిష్యత్తు మాత్రం పోగొట్టుకొని బ్రతకలేను మధూ! అందుకనే తొందరపడుతున్నాను. నిన్ను తొందరపెడుతున్నాను" అంటూ అతన్ని అకస్మాత్తుగా వాటేసుకొని బిగియార కౌగలించుకుంది అనూరాధ.

అప్రయత్నంగా ఆమె తనూ లతను చుట్టేసాయి అతని చేతులు. తలంటుపోసుకున్న

ఆమె జుట్టునుంచి వచ్చే మధుర పరిమళం అతన్ని ముప్పిరిగొంది. ఎప్పుడూ రుచి చూసి ఎరుగని స్త్రీ స్పర్శ. అందులో మనసిచ్చిన మగువ పరిష్వంగం. అతనికి బాహ్య స్మృతి పోయింది.

ఒకరిలో యింకొకరు ఐక్యమైపోయి అలా ఎంతసేపు ఉండిపోయారో వాళ్ళకే తెలియదు. ఎంతోసేపటికి అనూరాధకి స్పృహ కలిగింది. "మధూ!"

మత్తుగా వూకొట్టాడతను.

"నన్నింక వదిలిపెట్టవా?" అని అడిగింది గోముగా.

"ఈ కాలం స్తంభించిపోతే ఎంత బావుండును!"

"ఇంక నాకు కాలంతో పనిలేదు. ఒక్కసారి నీ ప్రేమామృతాన్ని చవి చేసాను. ఇంక నాకేమయిపోయినా పర్వాలేదు. నేనిప్పుడు చచ్చిపోవటానిక్కూడా సిద్ధంగా వున్నాను."

"అంత మాటనకు రాధా! నువ్వు లేకపోతే నేను లేను....."

సరిగ్గా అప్పుడే ఆ గది తలుపుల మీద ఎవరో తట్టారు. ఇద్దరూ ఉలిక్కిపడి ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఇద్దరికీ గుండెలు దడదడలాడాయి.

"ఎవరూ?" అని అడిగి ఊపిరి బిగపట్టాడు మాధవరావు.

"నేనేనండీ! సాయిని" శేషసాయి గొంతు వినపడింది.

మాధవరావు నెత్తిన పిడుగుపడినట్టయింది. 'ఏం చేయాలి?' అన్నట్టు ఆమెవైపు చూసాడు. ఆమె ముఖం తెల్లగా పాలిపోయి వుంది.

"మా రాధ ఎక్కడికి వెళ్ళిందో తెలుసాండీ! ఇంటికి తాళం వేసుంది...." మళ్ళీ శేషసాయి గొంతు బయటనుంచి వినపడింది.

మంచం క్రింద దాక్కోమన్నట్టు సంజ్ఞ చేశాడు మాధవరావు. ఆమె కదల్లేదు. తెగించిన దానిలా - కానున్నది కాక మానదని తెల్సినదానిలా - నిలబడిపోయింది. గబుక్కున మంచం దిగి ఆమె రెక్కపట్టుకొని ఆమెను మంచం కిందికి తోసేసి దుప్పటిని అంచుల క్రిందకంటా లాగి అప్పుడు వెళ్ళి తలుపులు తీసాడు మాధవరావు.

శేషసాయి మళ్ళీ అదే ప్రశ్న వేసాడు. తెలీదన్నట్టు తలవూపాడు మాధవరావు.

"మీ కభ్యంతరం లేకపోతే..."

"....లోపలికి రండి" అని అనక తప్పలేదు అతనికి.

"కొంచెం మంచినీళ్ళు యిస్తారా?"

అతనిచ్చిన మంచినీళ్ళు త్రాగాడు శేషసాయి. ".... నేను చాలారోజులుగా మీతో ఓ సంగతి చెప్పాలనుకుంటున్నా. అర్ధరాత్రి ఈ సొద ఏమిటని అనుకోకపోతే..."

"ఎంతమాట! చెప్పండి..." అప్పటికే అపరాధిగా క్రుంగిపోతున్న మాధవరావు శేషసాయి అంతఃకరణకి మరింత ముడుచుకుపోయాడు.

"రాధ కేవలం నా భార్య మాత్రమే కాదండీ! నాకు దేవత.... ఆమె సుఖమే నా సుఖం.

ఆమెకే కష్టం వచ్చినా నేను భరించలేను.....” అతని కంఠం గాద్గదికమయింది.

“మీరెందుకు చెపుతున్నారో!....” అయోమయంగా చూసాడు మాధవరావు.

“మీరు రాధకి చిన్ననాటి స్నేహితులు. ఆత్మీయులు. ఆమెను ఎంతగా ఆరాధిస్తున్నానో మీకు చెప్పటంలో అనుచితమేముంది?”

“అబ్బే. అది కాదండీ!....”

“నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. రాధకి నేనన్నా అభిమానమే! నేను పక్కన లేకుండా అన్నం తినదు. నేను కూడా రాందే వాళ్ళ వాళ్ళింటికి కూడా వెళ్ళదు. నాతో చెప్పందే ఏమీ చేయదు....”

శేషసాయి ఇంకా ఏదో చెప్పబోతున్నాడు. మంచం పట్టెమీదనుంచి క్రిందకి జీరాడుతున్న దుప్పటిని చివ్వున చీల్చుకొని బయటకు వచ్చింది అనూరాధ. రేగిన జుట్టు, నలిగిన చీర.... ఆమెను తేరిపార జూసాడు శేషశాయి.

మాధవరావు ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు!

“.....కాని, మీకు తెలియకుండ ఒక మహాపాపం చేసిందండీ మీ రాధ! తన కండకావరం తీర్చుకోటానికి పరాయివాడి గదిలో అడుగుపెట్టి భ్రష్టురాలయింది. మీ ప్రేమకి తగదండీ ఈ రాధ! ఒక్క వేటుకి నరికి పోగులు పెట్టండి” అంటూ బల్లమీద పళ్ళు కోసుకునే చాకుని తీసుకువచ్చి శేషశాయికి ఆవేశంగా అందించింది అనూరాధ.

“రాధదేమీ తప్పులేదండీ! నేనే ఆమెకు మాయమాటలు చెప్పి యిక్కడికి తీసుకు వచ్చి యింతకు తెగించాను. తప్పంతా నాదే శాయిగారూ!” అన్నాడు మాధవరావు అతనికి దగ్గరగా వస్తూ.

“తప్పు అతన్దికాదు. నాదండీ! నేనే అతని బుర్ర చెడగొట్టాను. ఇందులో అతనిదేం తప్పు లేదు. ముమ్మాటికీ తప్పు నాదే!.... మీరే శిక్ష విధించినా...”

అనూరాధ మాటలకడ్డు వచ్చాడు శేషశాయి. “.... పిచ్చి రాధ! తప్పు చేసానని ఎందుకంత కించపడతావు? మనసుపడిన వాడితో ప్రేమ పంచుకోవటం తప్పయితే ఈ లోకంలో సుఖపడుతున్న వాళ్ళంతా అపరాధులే అవుతారు!” అంటూ ఆమె చేతుల్లోని చాకుని నెమ్మదిగా విడిపించి తీసుకున్నాడు శేషశాయి.

రాధా మాధవులిద్దరూ చిత్ర ప్రతిమల్లా నిలబడిపోయారు.

“.....ఆవేశపడకుండా నేను చెప్పేది వినండి మాధవ్‌గారూ! రాధ మాకు పెళ్ళయిన క్రొత్తలో నాకు దూరం దూరంగా వుండేది. అది చూసి నేను చాలా బాధపడేవాడిని. ఎలాగయినా ఆమె మనస్సుని జయించాలని ఎంతో ఓర్పుగా మాట్లాడేవాడిని. నా శ్రమ ఫలించింది. రాధ మనస్సు నా వశమయింది – అని నేను సంతోషించి పట్టుమని పదిరోజులు కాలేదు. నాకు కారు ఆక్సిడెంటయింది. ఆ ప్రమాదంలో చచ్చిబ్రతికాను. కాని నా బేక్‌బోన్ బాగా దెబ్బతింది. నేను సంసార సుఖానికి పనికిరానని డాక్టర్లు చెప్పారు. నా ఆశలు అడుగంటి

పోయాయి"

"ఎంత ఘోరం జరిగింది!...." అన్నాడు మాధవరావు అప్రయత్నంగా.

".... అంతకన్న ఘోరం రాధకి జరిగినట్టు కాదా! నా రాధ జీవితం అడవి కాసిన వెన్నెల కావాల్సిందేనా. అని ఎంతో బాధపడ్డాను. విడాకులిస్తాను. మరెవర్నయినా పెళ్ళాడి సుఖపడమని ఎంతో యిదిగా రాధకి చెప్పాను. ఆమె ససేమిరా అంది. నా దురదృష్టం కొద్దీ నేను అశక్తుడినైప్పుడు రాధకి నా మీద ప్రేమ కలిగింది. కాని, నేనేం చేయాలి? ఈ సమస్యని ఎలా పరిష్కరించాలి. అహోరాత్రులు ఇదే నా ఆలోచన... రాధకి పుస్తకాలు, పత్రికలు చదవటం మక్కువ. తరచు మీ కథలు చదివి పొగుడుతూ చెప్పేది. ఒకసారి మీ కథ కేదో బహుమతి వచ్చిందని మీ ఫొటో పడిన పత్రిక నాకు చూపించింది. ఆమె కళ్ళల్లోని మెరుపు చూసేసరికి నాకేదో స్ఫురించింది. ఆ పత్రికకి రాసి మీ అడ్రసు సంపాదించాను. మీ గురించి వాకబు చేసాను. రాధతో మీ పెళ్ళి కాకపోవటానికి కారణం కూడా తెల్సుకున్నాను. మీ పెద్దవాళ్ళు మిమ్మల్ని విడదీసారు. విడిపోయిన మిమ్మల్ని ఎందుకు కలపకూడదు? - అని నాకనిపించింది. నా పరపతి ఉపయోగించి మిమ్మల్నీ వూరికి ట్రాన్స్‌ఫర్ చేయించాను. చివరికి మీకు తెలియకుండ మీ ఆఫీసు వాళ్ళతో చెప్పి మా యింటికి అద్దెకు వచ్చేలా చేసాను. బియ్యేకి కట్టమని రాధని ప్రోత్సహించింది .... కేవలం ఆమె మీకు చేరువ కావాలనే! క్యాంపు పనిమీద నేను వెళ్ళింది ఈనాడు మీరిలా ఒక్కరు కావాలనే!.... ముందే రాధతో చెపితే ఒప్పుకోదని నాకు తెల్సు. నా మీద ప్రేమతో తనని తాను కష్టపెట్టుకొంటుంది. కాని ఇందుకు సిద్ధపడదు. .... మీది నిజమయిన ప్రేమ. ఐదేళ్ళ మా వైవాహిక జీవితంలో ఒక్కసారి కూడ గొంతెత్తి పాడలేదు రాధ. మీరడగ్గానే పాడింది. మాధవ్‌గారూ! ప్లీజ్ డోన్ట్ మిస్టేక్‌మీ! అసూయతో అంటున్న మాటలు కావివి. మీరదృష్టవంతులు.... మూగవోయిన ఈ వీణని మళ్ళీ పలికించగలిగారు. ఆమె యికనుంచి మీసొత్తు....!"

ఒక్క ఉదుటన శేషశాయి పాదాలపై పడిపోయి "ఇంకేమాటలు చెప్పకండి. నేనీ శిక్ష భరించలేను" అని బావురుమంది అనూరాధ.

ఆమెను పొదివి పట్టుకుని పైకి లేవదీసాడు శేషశాయి. ఆమె కన్నీళ్ళు తుడుస్తూ "పిచ్చిదానా! అదృష్టం అతన్ది కాదు, నాది. నా రాధకి చేసిన అన్యాయానికి ఆ దేవుడే మరో మార్గం నాకు చూపించాడు. ఇప్పుడు నాకెంత సంతోషంగా వుందో నీకు తెలియదు. ఆ దేవుడికి తెల్సు! అతని కవితలు వింటూ నువ్వు, నీ పాటలు వింటూ అతను కలకాలం హాయిగా బ్రతకండి. ఈ లోకం కోసం భయపడుతూ మీ జీవితాలు నిస్సారం మాత్రం చేసుకోకండి. ఎవరు ఒప్పుకోకపోయినా మీకు పెళ్ళి చేయించే బాధ్యత నాది" అన్నాడు.

మాధవరావు గుక్కతిప్పుకునేలోగా అనూరాధ చేతుల్ని అతని చేతుల్లో పెట్టి తన యింటి తాళం చెవులు తీసుకొని డాబామెట్లు దిగి క్రిందకి వెళ్ళిపోయాడు శేషశాయి!

●